కథానిక

# దశావతారాలు

జి. సిహెచ్. వెంకటేశ్వర్లు

స్టేషన్‌లో బండి ఆగింది. అందాక కూర్చున్న మనుష్యులొక్కసారిగా లేచారు పుట్టపగిలిన ఈసుళ్లలా, మురుగుతూముల్లో దోమలలాగ. ఎందుకాతొందర, ఆ త్రోసుకోవటాలు? దిగే వాళ్ళను దిగకుండా ఎక్కేవాళ్ళు. ఎక్కేవాళ్లను ఎక్కకుండా దిగేవాళ్ళు శ్రమపడుతున్నారు. ఒక్క రెండు నిమిషాలకు అలజడితగ్గింది. బండి కిక్కిరిసి ఉంది. త్రోసుకుంటూ జనాన్ని చీల్చుకొని ఒకబ్బాయి లోపలికొచ్చాడు...

"ఉరులుదారలతో గొంతుకురిబిగించి...... దయలేనివారు మీ ఆడవారు", చక్కగా పాడాడా పద్యాన్ని. ఘంటసాలవారు ఏవిధంగా కళ్ళలొలికించారో అచ్చుదేమోస్తరు. కమ్మగా పాడాడు. ఆ పద్యం పూర్తి కాకపూర్వమే ఒకాయన "ఎద్దులాగ ఉన్నాడు పనిచేసుకోలేడూ, ప్రతివాడికీ యిదొక పనయిపోయింది" అన్నాడు.

"రామ! రామ! స్టేషనుకు నలుగు రెక్కుతుంటే ఎందరికనిస్తాం" ఇంకోదాత మొదటివారిని ధృఢపరిచారు.

"చూడండి నోరులేని పువ్వుల్ని కోసుకెళ్తుంటే ఆయెట్లాదుఃఖం జెందుతయ్యో ఘంటసాల వెంకటేశ్వర్లుగారు పాడారు. చదవతగ్గయ్. మీరంతా చదవాలి. ఈ పద్యాలేకాకుండా ఘంటసాలవారు పాడిన పాటలన్నీ కూడా ఉన్నయ్. మీరంతా కోరుతూంటే మా కంపెనీ వారు ఈ పుస్తకాని అచ్చేశారు" అంటూ సంచిలో నుండి కొన్నిపుస్తకాలు తీశాడు. "ఒక్కణా మాత్రమేనండి. కొనండి. మావెలలేని......నర జాతికి నీతియున్నదా!" ఆ పద్యమూ పూర్తయింది. పాడినంతసేపు చెవులురిక్కించి విన్నారు ప్రయాణీకులు.

"బాబూ ఒక్కణా మాత్రమే ఘంటసాలగారి పద్యాలు పాటలు. మీరు విడిగా కొనాలంటే ఇయ్యన్నీ దొరకవ్. రెండోమూడో పాటలు దొరికితే అర్థరూపాయి పావలా బెట్టి కొనుక్కోవాలి. మా కంపెనీవారు మీకోసమై ఒకణాఖరీదు కిచ్చేశారు. చాలాచౌక. అయ్యా ఎవరిక్కావాలండి?"

శ్రోతలు చెవులు మూర్చుకొన్నారు. ఆ అబ్బాయి మరో నాలుగుసార్లు కేకలు వేశాడు. "ఒక్కణా మాత్రమే ఘంటసాలగారి పద్యాలు పాటలు. మా కంపెనీ..." ఎవ్వరూ కొనలేదు. చేతిలోఉన్న సరుకు సంచిలోపెట్టి మళ్ళా యింకేవో తీశాడు.

"ఇదిగో చూడండీ! ఘంటసాలగారి పాటలు పద్యాలకన్నా యీ మాటలు వినండి. పిప్పిపన్ను లేస్తే దవడమహానొప్పి. అన్నంతిననియ్యదు. వారు చిన్న మునగవేరుముక్క తెచ్చుకొని నొప్పున్న చోట ఉంచండి... కొరింతదగ్గుతో రాత్రుళ్ళంతా బాధపడుతుంటారు. వారు నేలతంగేడుపూవులు వేయించి కాఫీలో కలిపి త్రాగండి... ఇటు వంటి అరవైనాలుగు వ్యాధులకూ అనుభవంతో శ్రీ సద్గురు వీరబ్రహ్మంగారి ప్రియశిష్యులు శ్రీ సత్యన్నారాయణ దీక్షితులుగారు రాశారు. ఈ ఆయుర్వేదంతోపాటు వచ్చే సంవత్సరపు కాలెండరు కూడా ఉంది. ఏరోజేపండుగో తిథులు, నక్షత్రాలు, వారాలు అన్నీ ఉన్నయ్. ఇన్నీకలిసి నాకంపెనీ ఒక పుస్తక మచ్చేసింది. ఇదే ఆ పుస్తకం. పాకెట్ కాలండర్. ఆయుర్వేదంతో కలసి ఒకణా. ఎవరిక్కావాలండి? అందరూ జేబులో ఉంచుకోదగ్గది. ఎవరిక్కావాలండి. ధర అతి చౌక. ప్రతివారికీ అవసరమైంది ఒక్కణా. బాబూ ఒక్కణా."

ఎవ్వరూ "నాకు కావాలి" అని అనలేదు. ఒక శాస్త్రిగారుమాత్రం పుస్తకం తీసుకొని ఆయుర్వేదాన్ని చూసి మళ్ళా తిరిగిచ్చేశారు.

"ఈ పుస్తకాలేకాదు ఇంకా ఉన్నయ్యండి. కొవ్వలివారి నవల్లు, జంపనవారి నవల్లు, లంకాదహనం కామమ్మకథ, కుచ్చలకథ, ఎడ్ల రామదాసు చరిత్ర, పడకటింటి ముచ్చట్లు, కొక్కో-

కం, కామశాస్త్రం, గుప్తాగారి పంచాంగం..." ఒక వరుస చదివాడు. ఎవ్వరూ అడగలేదు.

"ఏం బాబూ ఒక్కరూ బోణీ చెయ్యలేదే..." ఆశగా ప్రయాణీకులందరి ముఖాల్ని వీక్షించాడు. నిస్పృహతో సంచిలో పుస్తకాలు పెట్టుకుంటూ "ఒక్క నిమిషం ఇట్లా చూడండి బాబూ. కళ్ళల్లో పెట్టుకునే కలికం. తెల్లగంజేరు కలికం బిళ్ళలు. ఎవరికి తలనొప్పి, భారం, జ్వరంగా ఉందో వారీబిళ్ళను చన్నీళ్ళతో తడిచేసి రెండు కళ్ళల్లో రుద్దండి చప్పున లాగేస్తుంది. ఎటువంటి భారమైనా జమ్మున పోతుంది. ఇప్పుడుగాని యీ ఇంజెక్షన్లు పూర్వ్వలకాలంలో లేవు. ఈ తెల్లగంజేరు కలికమే ఎక్కువ వాడేవారు. మనదేశవాళిసరుకు ఒక్కణా మాత్రమే. ప్రతి యింట్లో ఉంచుకోదగింది. ఒక్కణా మాత్రమే. అతి చౌక, ధర సరసం, కొనండి. ఒక్కణా మాత్రమే..." ఊహూ ఇదికూడా ఎవ్వరూ కొనలేదు. మళ్ళా యింకో శాల్తిని సంచిలోనుండి తీశాడు.

"ఎన్నున్నాయ్ బాబూ అన్నీ నువ్వే అమ్ముతున్నావు? చూడగా బజారంతా నీవే తీసుకొచ్చినట్టున్నావే!" తల నెరసిన ఒకాయన అడగాడా అబ్బాయిని. సమాధానంకోసం కాదా యనడిగింది. ఇందాకటినుంచి నోట్లో నానుతున్న మాటలన్ని విడుదల చేయటానికి.

ఇంకో తెల్లతల నవ్వింది. గబుక్కున ఆపేసింది ఒక్కక్షణంలో ఆ నవ్వును. ఆ నవ్వుకు కారణమేమిటో మరి! ఎందుకో ఊరికే నవ్వుకొంటారు చాలమంది పెద్ద మనుష్యులు. ఒకాయనేదో మాటంటాడు. దాంట్లో హాస్యం ఉండదు. హేళనా ఉండదు. ఎత్తిపొడుపు అంతకన్నా ఉండవు. అంతమాత్రానికి పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుతారు. ఆ నవ్వు ఆ పెద్దలకే జెల్లు అసలు వారికి నవ్వురాదు. నవ్వకుండా ఉంటే "ఎప్పుడు చూసినా ముడగ దీసుకొనుంటుందేరా ఆయన ముఖం" అని అంటారేమోనని ఈ నకలు నవ్వును నేర్చుకుంటారు. ఎప్పుడుబడితే అప్పుడు రావటం, చటుక్కున ఆగిపోవటం యీ నవ్వు లక్షణాలు.

"ఒక్క రెండునిమిషాలే బాబూ అయిపోయింది" అన్నాడా అమ్ముకునే అబ్బాయి.

"మీరునోన్న రకాలైన పండ్లపొడి వాడున్నారు. అవన్నీ మిమ్మల్ని సంతోషపెట్టవండి. ఈ మార్కును చూచి కొనండి. నకలు సరుకులు చూచి మోసపోవద్దండి. కుక్కమార్కు పండ్లపొడి..."

ఈసారి ఆ అబ్బాయి మాటలు ఖాతరుచేసే వారేలేరు. అరిచాడు పదిహేనునిమిషాలసేపు. ప్రయోజనం శూన్యం. పంచీలో అన్నీ సర్దుకుంటూ "ఘంటసాలగారి పద్యాలు పాటలు, కొవ్వలివారి నవల్లు......" అంటూ బయటికి వెళ్ళాడు.

"వాన వెలిసింది" అందాక పేపరుచదువుతున్న ఒకాయనన్నాడు.

"గాలివానండి, ఉత్తవానకాదు. వాడొక వ్యాపారస్తుడా! అన్నివర్తకాలూ వాడివే. దశావతారాలెత్తుతాడు. ఒక క్షణంలో పుస్తకాల వ్యాపారి, మరుక్షణంలో మందులమ్మే వైద్యుడు" ఆయన ఉపన్యాసంకేసి పెట్టెలోఉన్న మనుష్యులంతా అతనివైపు దృష్టిని మరల్చారు అయాచితంగా వచ్చిన గౌరవాన్ని ప్రజలు తన వాక్యాలు వింటున్నారని తెలుసుకొని ఏదో విధంగా ప్రజల హృదయాన్ని చూరగొనాలి. రెండునిమిషాల్లో ఆ విషయం పోయింది. ఏదో చెపుతున్నారు. ఏదో కాదు. వారి స్వీయగాథే. అదొక టెక్నిక్. ఏదో ఒకవిషయంతో పెట్టెలో వారిదృష్టిని తనవైపు మరలించుకున్నాడు. తరువాత తన స్వీయగాథను వర్ణించి చెప్పుకుంటున్నాడు.

ఆ అబ్బాయి రెండోపెట్టెక్కాడు. అక్కడ కొంచెంసేపు ఘంటసాల పద్యాలు పాడాడు. పుస్తకాలు కొనండి అని నోరంతా చించుకొని అరిచాడు. ఆ స్వరంలో నిమిషనిమిషానికి దాగున్న బ్రతిమలాడటం, దీనంగా అడగటం తొంగిచూస్తుంది. దీనంగా అడిగాడు- "కొనండి ఘంటసాలగారి పద్యాలు పాటలు....అసలుకుక్కమార్కు పండ్లపొడి." ఎవ్వరూ కొనలేదు. బండి దిగాడు. మళ్ళీ అదే అరుపులు. ఆ యాచించటమే ప్రతిపెట్టెలో మారుమ్రోగింది. కొంచెంసేపటికా బండి వెళ్ళిపోయింది. మరో మూడుబళ్ళువచ్చి వెళ్ళిపోయేదాకా అక్కడే ఉన్నాడు. అవి కూడా వెళ్ళిపోయినై. ప్రొద్దు నడినెత్తిమీదకొచ్చింది.

నెత్తిమరచుర మంటోంది. కాళ్లు లాక్కుపోతున్నయ్. పాదాలు కాల్తున్నయ్. చెమట తుడుచుకుంటూ, బేరంకాలేదని చీదరించుకుంటూ జేబులో డబ్బుల్ని చేతిలోకి తీసుకొని చూచుకొన్నాడు. "అరణాలు. ఏమిబేరం? ప్రొద్దున్నే ఎవరిముఖం చూశానో. ఇవ్వాళ దరిద్రంగా నేకుంది నా బేరం" అనుకున్నాడు.

*  *  *

మూసుకుపోతున్న కళ్లతో కాళ్ళీడ్చుకుంటూ యింటికిచేరేశాడు తనశరీరాన్ని. నులకమంచం వాల్చి 'ఉష్' మని దానిమీద వాలాడు.

"ఏమాత్రం?" అంది అతని భార్య.

"ఏమొచ్చింది. నాబొందొచ్చింది. ఇదిగో" అంటూ చాచిన ఆమెచేతిలో పోశాడా చిల్లర డబ్బులు.

లెక్కవేసి "అరణాలేనా?" అంది.

"ఏంచెయ్యమంటావే! చూస్తానే ఉంటివిగా ప్రొద్దునంగా పోతిని. చచ్చిచెడీ గొంతంతా చించుకొని అరిస్తే ఆ అరణాలయినా. అసలు బేరాలు మందగించినై." నిట్టూర్పు విడుస్తూ అన్నాడు.

"నె నెట్టా చచ్చేదంటా! అరణాల్తో ఏం తెచ్చేది, ఏం వొండేది. నిన్నమటుకు నిన్న అర్థరూపాయి చేతిలో బెడ్తివి. వెంకమ్మదగ్గిర బియ్యం అప్పుజేస్తుంటే చూస్తూనే ఉంటివి. కోమటాయన కియ్యాల్సిన రెండు రూపాయలట్లాగే ఉంది. ఇక నేనెట్టా ఊరేగేది."

"రోజు లెల్లకాలం ఇట్లాగే ఉండలేక ఏదో కాస్త ఉడకేయ్. మళ్ళీ బండి[illegible]ళ్లి. మన రోజులు బాగుండలా. లేకపోతే ఎటువంటి బేరపు రోజులీరోజులు. నిరుడీ రోజుల్లోరోజూ నాలుగైదు యీ పుస్తకాలమీదే తీయలా. ప్చ్. ఏమికానీయ్. కాస్త ఉడకేయ్" అన్నాడు.

"ఏమిటి కానిచ్చేది నా బొంద నా బోలె. ఇంటి చుట్టూర అప్పులయిపోయె. ఇంకా ఎంతని అప్పుజేసేది? గడపగడిత్తే మొఖం వాచేటట్లు చివాట్లు పెడుతుంటారు. నాకు తెలియదయ్యా ఆ తీసుకొచ్చేది నువ్వే తీసుకురా. ఉడకేస్తా. మధ్య నాకెందుకు చివాట్లు తిట్లూను." ఆ అరణా లతని చేతిలో పెట్టి బయటికెళ్ళింది.

"నీకుకదూ చెప్పేది. ఎట్లాగో ఒకట్లా ఇవ్వాళ్టికి చూడమంటల్లా." మంచంమీదనుంచి లేచి కసిరాడు.

"నీకు కోపమొస్తే నేనేంచేసేది? ఎక్కడకెళ్లమంటావ్? ఎక్కడకైనా వెళ్ళి దోచుకురావాలి" అంది.

ఆవిణ్ణి సమాధానపరచి రచ్చకెక్కకుండా చూచుకునేసరికి ఒంటిగంటయింది. పొట్టలో కొక్కులో త్రవ్వుతున్నయ్. ఆమె అదే స్థితిలో ఉంది. పోట్లాడేశక్తి సన్నగిల్లింది. ఆ అరణాలు పుచ్చుకొని చక్కా బజారు వెళ్ళింది.

మంచాని కడ్డంగా పడుకున్నా డతను. కునుకుపట్టింది. "అన్నం తిందుగానిలే"అని భార్య లేపేదాకా అంతసేపు నిద్రపోయాడని అతనికి తెలీదు. మూడుగంటల కోచీ కూత వేసింది.

ముఖం కడుక్కొని కంచందగ్గర కూర్చున్నాడు. రెండుముద్దలు మ్రింగేదాకా దాని రుచి తనికి తెలియలేదు. అప్పటి కతని జ్ఞానశక్తి పనిచేసింది. అదేకూరో తెలుసుకోగలిగాడు. కళ్లెర్రజేసుకొని "ఎక్కడదీ మాంసం కూర?"

"ఆ సాయిబే అప్పిచ్చాడంది"ఎదురుగ్గా పీట వేసుకుని తింటున్న అతనిభార్య సంకోచిస్తూ.

"వాడివగ్గర తీసుకు రావద్దని ఎన్నిసార్లు చెప్పాను? అన్నంలోకే పచ్చిపులుసు చాలదూ? మాంసంకావాలా? ఇట్లాకదూ నాసంసారం గుల్ల చేసేది" కోపం ముదరినస్వరంతో అన్నాడు.

"మహా సంపాదించావులేవయ్యా! సంపాదించావు! నీవు సంపాదించిన లక్షలు మూలుగుతున్నయ్ మూల."

"మాటంటే మాటంటావంటే..." అంటూ కూర్చున్నపీటచెక్కతో ఆవిడ తలమీదకొట్టాడు.

"నాయనోయ్! బాబోయ్! రండర్రో! నన్ను చీరేస్తున్నాడర్రో!" కేకలువేయటం మొదలు పెట్టింది.

"ముందు నోర్మూయ్. ఎన్నిసార్లుచెప్పాను. ఆ సాయిబు మాంసం తీసుకురావద్దని? అసలు వాడితో నీకు పాత్తేమిటి? ఆఁ...చెప్పు"అంటూ వీపుమీద రెండుగ్రుద్దులు వేశాడు ఎంగిలిచేత్తోనే.

ఆవిడ స్వరం హెచ్చుస్థాయిలోకి పెరిగింది. ఇరుగుపొరుగు జనం ప్రోగయ్యారు.

"నీకు సిగ్గులేదంట్రా. ఆవదాన దాన్ని చంపుతున్నావ్" అని ఒక ముసలి ముదినాపసాని అతని ముఖం కడిగింది.

"ఏమీ లేకపోయినా అప్పోసొప్పోజేసి వేళ కింత కాసిపోస్తున్నందుకా బాబూ యీ పడ్డింపులు" గోడప్రక్కనే నిలబడిన ఒకావిడ.

"ఆ కాపురం అది కాబట్టే వేగుతుంది. నా బోటిదైతే ఏనుయ్యో గుయ్యో చూచుకునేది. ఇటువంటి వాళ్ళకు పెళ్ళాలెందుకు! పోషించలేని వాళ్ళకు మహారోషం. రోషమాని" ఇంకో ఆవిడ.

అంతా ఆడవాళ్ళే అక్కడ ప్రోగయింది. ఒక ముసలాయన మాత్రం వచ్చాడు. ఆయన కొండయ్యతాత. "ఏమిట్రా అబ్బాయిదీ? ఎంతయితే మాత్రం చేయిచేసుకుంటారట్రా" అని ఆడవాళ్ళనసి చూసి "వెళ్ళండమ్మా వెళ్ళండి ఏముంది. వాణ్ణి గాబరా చేస్తారెందుకు. పొండి. ఆలుమగళ్ళన్న తర్వాత కొట్టుకోకుండా తిట్టుకోకుండా ఉంటారా ఏం. పొండి" మగజాతికి జ్యోతిగా గర్జించాడు ముసలాయన.

అంతా వెళ్ళిపోయారు, దెబ్బలు తిన్నచోటే పడుకుని మూలుగుతుందింకా భార్య. ఆమె ఏడుపు చూస్తే జాలివేసిందతనికి. కాని లోపల కుమిలిపోతున్నాడు. కోపాన్ని అణచుకోలేక పోతున్నాడు. తనభార్య ఇలాంటిపని చేస్తుందా? అని మండిపోతున్నాడు. లజ్జతో తలవంచుకున్నాడు. మాంసంకూర తెచ్చిందని కాదతనికి కోపం. ఆ సాయిబుకీ తన భార్యకీ సంబంధం ఉందని లోకమంతా చెప్పుకుంటోంది. తాను వాడిదగ్గరకు వెళ్ళవొద్దన్నా వెళ్తోంది. వెధవవాడి మాంసమెంతజేస్తుంది. దానికోసమేనా వాడిదగ్గరకిది వెళ్ళటం. అసలు దాన్ని పోషించలేని బుద్ధి తక్కువ నాది. ఇన్ననుకొని ప్రయోజనమేమిటి? అనుకొంటూ బయటికి వెళ్ళిపోయాడు.

స్టేషనులోకి వెళ్లాడు సాయంత్రం అయిదుగంటలయింది. ఫుట్ పాట్ మీదతిరుగుతూ, "ఘంటసాల వారి పద్యాలు, పాటలు. కొవ్వలి నవలలు. క్యాలెండర్లు... తెల్లగంజేరుకలికం, కుక్కమార్కు పండ్లపొడి..." అంటూ భారంగా నడుస్తూ బండి కిటికీల్లోనుండి తొంగిచూస్తూ అరుస్తున్నాడు.

"టీ చాయ్‌గరమ్" అనే కేకల్లో "ఆయే మసాలవడే" అనే అరపులలో అతనిస్వరం లీనమయిపోయింది.

---

# జీవనస్వరాలు

వేముగంటి

విలాసమయమైన నేటి
  కళామధుర జీవితంలో
గతస్మృతుల అపశ్రుతులు
గానంచేయట మెందుకు?

ప్రశాంత మధురమైన
ఉషోదేవి పెదవుల
రాగమధువు నింపిన
భోగపాత్ర ముందున్నప్పుడు
చితికిపోయిన చీకటి
చేదును స్మరించేదెవ్వడు?

వసంతరసరాజ్యం
కుసుమించిన తరుణంలో
నగ్నశిశిర పలాశాల
అగ్నికీల లాసించేమా?

ప్రణయినీ సువర్ణకంకణ
క్వణనధ్వనిలో మునిగి
నీరస నిర్జీవగళాల
నినాదం వినేదెవ్వరు?

కమ్మని రసభాండమైన
కావ్యఖండం ముందర
భావమాధుర్య మరికట్టే
వ్యాకరణ ప్రస్తావనెందుకు?